గంజాయి వినియోగదారుల్లో పరివర్తన తేవాలి

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

కోదాడ టౌన్, జనవరి 29 : గంజాయి వినియోగదారులను గుర్తించి వారిలో పరివర్తన తీసుకు రావాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. సోమవారం కోదాడ సబ్ డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ స్థాయి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ల నందు నమోదైన గంజాయి కేసులపై సమీక్ష చేసి, కేసుల దర్యాప్తులో ప్రణాళిక పాటించాలన్నారు. అన్ని విషయాలను రికార్డు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తులో మెళకువలు, సూచనలు అందించారు. యువత డ్రగ్స్ వినియోగించి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో సీఐలు రాము, వీరరాఘవులు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వసతులు కల్పించాలి

● అదనపు కలెక్టర్ ప్రియాంక

గ్రంథాలయ బడ్జెట్ వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట, జనవరి 29 : జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 2024-25 సంవత్సర గ్రంథాలయ బడ్జెట్ అంచనాల ఆమోదం కోసం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో పబ్లిక్ రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలని అందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని గ్రంథాలయాలకు కావాల్సిన పుస్తకాలు, ఫర్నీచర్, బిల్డింగ్ మరమ్మతులు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పాఠకుల అభిరుచులకు అనుగుణంగా పుస్తకాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డీఈఓ అశోక్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కేవీ సీతారామశాస్త్రి , ఉద్యోగులు రంగారావు, శ్రవణ్‌కుమార్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

31న సూర్యాపేటలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

● సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్

త్యాగరాజ ఆరాధనోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్

బొడ్రాయిబజార్, జనవరి 29 : సుధా బ్యాంక్ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 31న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 5 గంటలకు త్యాగరాజ ఆరాధానోత్సవాలు నిర్వహించనున్నట్లు సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేశ్ తెలిపారు. సోమవారం బ్యాంక్ ఆవరణలో ఆరాధనోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళాకారులతో పాటు సూర్యాపేట మారుతి విద్యానికేతన్ విద్యార్థులచే కళా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయని, అన్నమాచార్య భవన వాహిని ట్రస్ట్ చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ శోభారాజును సన్మానించనున్నట్లు వెల్లడించారు. ఆరాధనోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కళాభిమానులు, ఖాతాదారులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు పొనుగోటి నిర్మల, కమ్లేకర్ శంకర్‌లాల్, కక్కిరేణి చంద్రశేఖర్, ఏపూరి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

రవీందర్

మహేంద్రనాథ్

పెన్‌పహాడ్, జనవరి 29 : పెన్‌పహాడ్ ఎస్ఐగా రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై పెన్‌పహాడ్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ నర్సింగ్ వెంకన్న సీసీఎస్‌కు ఎటాచ్ అయ్యారు.

అర్వపల్లి ఎస్ఐగా మహేంద్రనాథ్

అర్వపల్లి, జనవరి 29 : అర్వపల్లి నూతన ఎస్ఐగా మహేంద్రనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన అంజిరెడ్డి సూర్యాపేట హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. సూర్యాపేట టౌన్ ఎస్ఐగా పని చేసిన మహేంద్రనాథ్ ఇక్కడకు వచ్చారు.

నూతనకల్‌లో నేడు ఎమ్మెల్యే మందుల సామేల్ పర్యటన

నూతనకల్, జనవరి 29 : ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం మండల కేంద్రంలో పర్యటించనున్నట్లు సర్పంచ్ తీగల కరుణశ్రీగిరధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన అలాగే రూ.50 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
My Son, KETHAVATH JESWITH NAIK S/O KETHAVATH JEEVAN SINGH and DHANAVATH NAVYA SRI(Mother), Age: 07 years, Student, Shall henceforth be known as KETHAVATH JESWITH RATHOD S/O KETHAVATH JEEVAN SINGH, DHANAVATH NAVYA SRI.F

CHANGE OF NAME
★I, KATHI NAGIREDDY, R/o. H.No. 1-4-124, Edga Road, Suryapet, Telangana-508 213, that I Changed My Name as KATTI NAGI REDDY, Son of Katti Narsi Reddy.
NT-311504

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | తొలుపునూరి: 9182777638

నూతన భవనాలతో పంచాయతీలకు శోభ

● ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, జనవరి 29 : నూతన పంచాయతీల భవనాల నిర్మాణంతో గ్రామాలకు కొత్త శోభ సంతరించుకున్నదని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.90 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనంతో పాటు, లైబ్రరీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, యాదాద్రి జిల్లా జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లో శానిటేషన్ పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని, గ్రామస్తులు తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చెందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావత్ కుమారీబాబునాయక్, జడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, సర్పంచ్ జూలకంటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, భద్రునాయక్ పాల్గొన్నారు.

బొప్పారంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఆత్మకూర్.ఎస్ : మండలంలోని బొప్పారం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. చదువు అభివృద్ధికి కారణమని అంబేద్కర్ తెలిపారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ మర్ల స్వర్ణలతాచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ ఇందూరు ఎల్లయ్య, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హాసేన్, టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రజా సేవ తప్పా ఎక్కడా రూపాయి ఆశించలేదు

● బీసీకి చైర్మన్ పదవి ఇస్తే కట్టుబడి ఉండేవాళ్లం

● కౌన్సిలర్ పావనీకృపాకర్

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ గండూరి పావనీకృపాకర్

బొడ్రాయిబజార్, జనవరి 29 : తన సొంత డబ్బులు రూ.5 కోట్లతో పట్టణ వ్యాప్తంగా ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు, ఏనాడు ఎవరిని రూపాయి కూడా ఆశించలేదని సూర్యాపేట 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావనీకృపాకర్ అన్నారు. అగ్రవర్ణాలకు చెందిన నిఖిల దిలీప్‌రెడ్డికి మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తామనడంతో దళిత మహిళను ఆ స్థానం నుంచి దింపకుండా ఉండేందుకే తాను అసమ్మతికి మద్దతు తెలుపలేదన్నారు. సోమవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాను డబ్బులకు అమ్ముడుపోయి అవిశ్వాసానికి మద్దతు పలుకలేదన్నారు. అసమ్మతి కౌన్సిలర్లు తన ఇంటిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. వారికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. అవిశ్వాసానికి ముందు బీఎస్పీ కౌన్సిలర్లు తన వద్దకు రాగా బీసీ బిడ్డగా చైర్మన్ అవకాశం తనకు ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. అందుకు వారు ప్రస్తుత చైర్మన్‌ను దింపి సమావేశం ఏర్పాటు చేసుకుని నిర్ణయం తీసుకుందామని చెప్పడంతో తాను సంతకం చేసినట్లు చెప్పారు. తర్వాత వాళ్లు కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుకుని కొండపల్లి నిఖిలాదిలీప్‌రెడ్డిని చైర్మన్ అన్నారని, వైస్ చైర్మన్ కాంగ్రెస్ నుంచి ఇస్తారని తెలిసింది. ఈ విషయమై బీఎస్పీ నాయకులతో మాట్లాడగా కాలయాపన చేసినట్లు వెల్లడించారు. బీసీకి చైర్మన్ ఇస్తే తాను కట్టుబడి ఉండేవాడినని, అలా కాకుండా అగ్ర వర్ణాలకు చెందిన వారికి పదవి ఇస్తామనడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో కోదాడ వాసికి డాక్టరేట్

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న హసన్ జానీ

కోదాడ టౌన్, జనవరి 29 : మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన ఎస్‌కే హసన్ జానీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ వైరవ సుందరం పర్యవేక్షణలో తమిళనాడులోని కరైకుడి అలగప్ప యూనివర్సిటీ నుంచి ఎఫెక్ట్ ఆఫ్ ఎరోబిక్ సర్క్యూట్ ట్రైనింగ్ అండ్ సస్పెన్షన్ ట్రైనింగ్ సెలెక్టడ్ ఫర్ఫామెన్స్ పారామీటర్ ఆఫ్ ది సీనియర్ అథ్లెట్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ లభించింది. సోమవారం జరిగిన వర్సిటీ కాన్వకేషన్ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి చేతుల మీదుగా జానీ డాక్టరేట్ అందుకున్నాడు.

ఆశ వర్కర్లకు వేతనాలు విడుదల చేయాలి

● ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గురూజీ

సూర్యాపేట, జనవరి 29 : రెండు నెలలుగా ఆశ వర్కర్లకు వేతనాలు ఇవ్వడం లేదని వెంటనే వారికి వేతనాలు విడుదల చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఆశ వర్కర్లతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, వారికి కనీస వేతనం రూ.18 వేలకు పెంచి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గోపగాని విజయ, నాతి జయమ్మ, జక్కుల అనిత, గుగులోతు జ్యోతి, మాదవి, ధనమ్మ, రావేల, నూక లక్ష్మి, శారద పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

● సర్పంచ్ లింగారెడ్డి

నూతనకల్, జనవరి 29 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదువుకోవాలని మండలంలోని తాళ్లసింగారం గ్రామ సర్పంచ్ చూడి లింగారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆప్ గ్రేడ్ మై క్లాస్ రూమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.40 వేలతో గ్రంథాలయ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం తండు వెంకటనారాయణ, ఉపాధ్యాయులు దేవరాజు, భిక్షం, మధుసుదన్ రెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

గరిడేపల్లి, జనవరి 29 : తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు గాయపడ్డ ఘటన మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనంతు చిన్న భిక్షాలు రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు మోకు జారడంతో కింద పడ్డాడు. దాంతో అతడి కాళ్లు విరుగగా దవాఖానకు తరలించారు.

సోమప్ప దేవాలయ చైర్మన్ శ్రీనివాస్ రాజీనామా

నేరేడుచర్ల, జనవరి 29 : నేరేడుచర్ల మండలంలోని చారిత్రాత్మక సోమప్ప దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న రాచకొండ శ్రీనివాస్‌రావు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం దేవాదాయ శాఖ అధికారులకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చేపట్టిన అభివృద్ధి పనులకు సహకరించిన దాతలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు

మునగాల, జనవరి 29 : సర్వే నంబర్ 491లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలందరికీ ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అన్నారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో 60 ఏండ్ల క్రితమే ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇకనైనా వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దేవర వెంకట్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, కిన్నెర వెంకన్న, గడ్డం వెంకన్న, తొగటి వేలాద్రి, గట్టు శ్రీను, రవి, గోవింద్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

తాసీల్దార్‌కు వినతి

నేరేడుచర్ల : మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి ఇండ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని, అంబేద్కర్ భవనాలకు నిధులు కేటాయించాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో తాసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల, పట్టణాధ్యక్షులు యడవల్లి అరుణ్, ఇంజమూరి పున్నయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఫలితాలు సాధించాలి

● ఆర్సీఓ అరుణకుమారి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్సీఓ అరుణకుమారి

నడిగూడెం, జనవరి 29 : పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్సీఓ అరుణకుమారి అన్నారు. సోమవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మైక్రో షెడ్యూల్, టీచింగ్ డైరీలు తదితర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్స్ వసంత, రేణుక పాల్గొన్నారు.

అధ్యాపకులకు సన్మానం

అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సోమయ్య

నడిగూడెం, జనవరి 29 : వివిధ సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అధ్యాపకులను స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్ కర్నాటి శ్రీధర్, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్.కృష్ణ, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగామ ఈశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కొల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శి తేరాల ఉపేందర్, అడ్వైజరీ సెక్రటరీ దొంగరి శ్రీనివాస్‌రావు, లేడి సెక్రటరీ రజిత ఉన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటో-బైక్ ఢీ.. వ్యక్తి మృతి

అనంతగిరి, జనవరి 29 : ఆటో, బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తమ్మర బండపాలెం వద్ద సోమవారం జరిగింది. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం బొజ్జగూడెంతండాకు చెందిన ధరావత్ బాలాజీ (53) పొలం పనులపై తన టీవీఎస్ వాహనంపై కోదాడ వచ్చి వెళ్తుండగా తమ్మర వద్ద ఖమ్మం నుంచి కోదాడ వైపు వెళ్తున్న ఆటో అదుపుప్పతి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ దాసోజు నాగేంద్రబాబుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

ఆర్థిక సాయం

మేళ్లచెర్వు, జనవరి 29 : మండలంలోని కందిబండ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పులి రాజుకు జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం, మందులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపి, సోషల్ వర్కర్ మంద రవి, వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలక నాగేశ్వర్‌రావుతో, సభ్యులు గోపి, వీరయ్య, రాములు, ధనమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

ప్రజావాణిలో దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవాం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 67 దరఖాస్తులు వచ్చినట్లు, వాటిలో భూ సమస్యల పరిష్కారం కోసం 26 రాగా వివిధ శాఖలకు 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అలాగే వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ నిధులతో మోడల్ స్కూల్స్, కస్తూర్బా స్కూళ్లలో ప్రహరీలు, టాయిలెట్స్, డైనింగ్‌లు, నూతన గ్రామ పంచాయతీ భవనాలు, సబ్ సెంటర్ల నిర్మాణాలకు సత్వరమే ప్రతిపాదనలు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీఈఓ అశోక్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 12న నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

సూర్యాపేట : ఫిబ్రవరి 12న జిల్లాలో పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మందులు అందించాలని, అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, వెంకట్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 2.13 లక్షల మంది పిల్లలు ఉన్నారని, వారందరికి నులి పురుగుల నివారణ మందు ల అందించాలన్నారు. ఆ రోజు లేని వారికి ఫిబ్రవరి 19న ఇవ్వాలని పేర్కొన్నారు. డీఐఓ డాక్టర్ వెంకటరమణ, డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, డీఈఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై విద్యార్థులు పట్టు సాధించాలి : ఎంఈఓ

పెన్‌పహాడ్ : విద్యార్థులకు ప్రసంశ పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ రవి

పెన్‌పహాడ్, జనవరి 29 : నేటి పోటీ ప్రపంచంలో అనుకున్న లక్ష్య సాధన దిశగా ముందుకు వెళ్లాలంటే విద్యార్థులు ఇప్పటి నుంచే ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఈఎల్‌టీఏ స్పెల్ విజర్డ్, నాటక పోటీల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణశ్రీ, కృష్ణప్రసాద్, మహబూబ్ అలీ పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్‌లో ఇంగ్లిష్‌పై మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా కాంపిటేషన్ పోటీలను నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ కేటగిరిలో స్పెల్ విజార్డ్ గోరెంట్ల విద్యార్థి అంగిరేకుల శివతేజ, డ్రామా కాంపిటేషన్‌లో చిననేమిల విద్యార్థి బృందం, కేజీబీవీ నుంచి స్పెల్ విజార్డ్‌కు పూజిత, డ్రామా కాంపిటేషన్‌కు కేజీబీవీ విద్యార్థినుల బృందం జిల్లా స్థాయికి ఎంపికైంది.

అర్వపల్లి : మండల స్థాయి స్పెల్ విజార్డ్ పోటీల్లో తిమ్మాపురం జడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించింది. ఉపాధ్యాయుడు వర్దెల్లి కృష్ణయ్య విద్యార్థిని రూ.వెయ్యి నగదు బహుమతి అందజేశారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నేరేడుచర్ల, జనవరి 29 : మండలంలోని చిల్లేపల్లి పీఏసీఎస్‌లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన చైర్మన్, సీఈఓపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పీఏసీఎస్ డైరెక్టర్లు కలెక్టర్ వెంకట్రావ్‌కు ఫిర్యాదు చేశారు. వేరే ప్రాంత రైతుల పేరుమీద బిల్లులు తయారు చేసి ఐకేపీ ధాన్యం అమ్మినట్లుగా చేసి ఆ బిల్లులను చైర్మన్, అతని బంధువుల ఖాతాలోకి మళ్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. లక్షా 25 వేల బస్తాల ధాన్యం కొనుగోలులో గోల్‌మాల్ నడిచిందని, సంఘం డైరెక్టర్లకు తెలియకుండా అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. వెంటనే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రమాణారెడ్డి, హేమలత, రంగారెడ్